ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 09-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాను సందర్శించనున్నారు.
- ఫ్రాన్స్, అమెరికా దేశాల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు బయలుదేరి వెళ్లనున్నారు.
- భారత ఆర్థిక వ్యవస్థ, 2027 నాటికి ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు.
- పరీక్షల సమయంలో విద్యార్థులలో ఒత్తిడి తొలగించడానికి ప్రారంభించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం 8వ సంచిక రేపు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాను సందర్శించనున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల సంగమ స్థలమైన త్రివేణి సంగమంలో పుణ్య స్నానమాచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లోని అక్షయవత్, బడే హనుమాన్ ఆలయాన్ని రాష్ట్రపతి సందర్శిస్తారు. డిజిటల్ మహాకుంభ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఆధునిక సాంకేతికత ద్వారా మహాకుంభ ఏర్పాట్లను ఆమె పరిశీలిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్, అమెరికా దేశాల పర్యటన నిమిత్తం రేపు బయలుదేరి వెళుతున్నారు. దీనిలో భాగంగా రేపటి నుండి నుండి 12 తేదీ వరకు ఫ్రాన్స్ లో పర్యటించనున్న ప్రధానమంత్రి పారిస్‌లో జరిగే AI యాక్షన్ సమ్మిట్ 2025 కు ఫ్రెంచ్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి హాజరవుతారని ఫ్రాన్స్‌లోని భారత రాయబారి సంజీవ్ కుమార్ సింగ్లా తెలిపారు. అనంతరం దౌత్యపరమైన సంబంధాలను మరింతగా పెంపొందించడానికి కొత్త భారత కాన్సులేట్‌ను ప్రారంభిస్తారని, తర్వాత అమెరికా బయలుదేరి వెళతారని వెల్లడించారు. రెండు దేశాలతో వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని సంజీవ్ కుమార్ సింగ్లా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్‌ను కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు పరిశీలించి, గోరఖ్‌పూర్ జంక్షన్ ప్రతిపాదిత నమూనాను సమీక్షించారు. రైల్వే అధికారులు మోడల్ స్టేషన్ వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ, రైల్వే స్టేషన్ డిజైన్‌ను తాను పరిశీలించానని అది గోరఖ్‌పూర్ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉందని తెలిపారు. విమానాశ్రయం కొత్త టెర్మినల్ సమీపంలో కొత్త రైల్వే స్టేషన్‌ను రూపొందించడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు ఆయన తెలియజేస్తూ..

(వాయిస్..37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వ్యవస్థ, 2027 నాటికి ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖా సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. ఈరోజు పుదుచ్చేరిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2025-26 కేంద్ర బడ్జెట్ భారతదేశ వృద్ధిని వేగవంతం చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. పేదరికాన్ని నిర్మూలించడం బడ్జెట్ యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 25 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన నుండి ఎగువకు చేరుకున్నారని, ఈ పురోగతిని కొత్త బడ్జెట్ మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' దార్శనికత కింద భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మణిపుర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈరోజు గవర్నర్ అజయ్ కుమార్ భల్లాను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. జాతుల మధ్య వైరంతో కొంతకాలంగా మణిపుర్ లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో అల్లర్లను అరికట్టడంలో బీరెన్ సింగ్ ప్రభుత్వం విఫలమైందని విపక్షాలు నుంచి ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో బీరెన్ సింగ్ పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు రాష్ట్రానికి సేవ చేయడం గౌరవంగా భావిస్తున్నానని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల సమయంలో విద్యార్థులలో ఒత్తిడి తొలగించడానికి ప్రధానమంత్రి  నరేంద్రమోదీ  ప్రారంభించిన కార్యక్రమం 'పరీక్షా పే చర్చ' 8వ సంచిక రేపు న్యూఢిల్లీలోని భారత మండపంలో జరగనుంది. త్వరలో పరీక్షలు రానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని సరికొత్తగా నిర్వహిస్తున్నారు. ఈ  నేపథ్యంలో విభిన్న రంగాలకు చెందిన ప్రఖ్యాత వ్యక్తులు విద్యార్థులతో సంభాషించి, వారి అనుభవాలు,  జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థుల్లోని  భయాన్ని తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం  ప్రధానమంత్రి ఈ కార్యక్రమం ద్వారా చేస్తున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మిళితం చేస్తూ.. 'పరీక్షా పే చర్చ' నిర్వహిస్తున్నారు. రేపు ఉదయం 11 గంటలకు ప్రారంభమై.. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్, స్వయం ప్రభ, PMO యూట్యూబ్ ఛానల్,  విద్య,  సమాచార ప్రసార మంత్రిత్వ శాఖల సామాజిక ప్రసార మాధ్యమాలలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఈరోజు తన పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి రాజీనామా లేఖను అందించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీని, భారతీయ జనతా పార్టీ ఓడించిన నేపథ్యంలో ఆమె రాజీనామా చేశారు. కాగా ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరిపై ఆమె కల్కాజీలో 3,521 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే ఢిల్లీ ఎన్నికల్లో BJP మొత్తంగా 48 సీట్లు గెల్చుకుని భారీ విజయాన్ని సాధించింది. మరోవైపు ఈ ఎన్నికల్లో ఆప్ కీలక నేతలు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్, పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ఓటమి పాలయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు గాయపడగా.. వారిని రాయ్‌పూర్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నక్సలిజాన్ని రూపుమాపడంలో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, నారాయణ్‌పూర్, బస్తర్ సహా పలు ప్రాంతాలలో భద్రతా బలగాలు, పోలీసుల ఆపరేషన్లు వేగవంతం చేశాయి. కాగా ఈ

ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చే దిశగా భద్రతాదళాలు భారీ విజయాన్ని సాధించాయని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని సామాజిక మాధ్యమం వేదికగా పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలో 10 మంది ప్రయాణికులతో వెళ్తూ అదృశ్యమైన విమానం కూలిపోయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పైలట్ తో సహా విమానంలో ఉన్న తొమ్మిది మంది ప్రయాణికులు మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం సాయంత్రం అలస్కా మీదుగా నోమ్ వెళ్తున్న విమానం నుండి సిగ్నల్స్ అందకపోవడంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టగా.. సముద్రంలో భారీ మంచుఫలకంపై విమానం కూలిపోయి ఉండటాన్ని గుర్తించారు. గత 25 సంవత్సరాలలో అలాస్కాలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాలలో ఇది ఒకటి కాగా, గత ఎనిమిది రోజులలో అమెరికాలో మూడు విమాన ప్రమాదాలు సంభవించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం ప్రత్యర్థుల చర్యలను నివారించేందుకు ఆపరేషన్ డెవిల్స్ హంట్ పేరిట చర్యలు చేపట్టింది. మాజీ ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులు కొన్ని విద్యార్థి బృందాలపై దాడులు చేశారని, ఈ నేపథ్యంలో ప్రజ భద్రతలో భాగంగా ఆపరేషన్ డెవిల్స్ హంట్‌ను అమలు చేస్తున్నామని హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. దీనిని గాజీపుర్‌లో మొదలు పెట్టి దేశం మొత్తం అమలు చేస్తామని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రెండో వన్డే క్రికెట్ మ్యాచ్ ఈరోజు ఒడిశాలోని కటక్‌లో, బారాబతి స్టేడియంలో జరుగుతుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు 49.5 ఓవర్లలో మొత్తం వికెట్లను కోల్పోయి 304 పరుగులు చేసింది. ప్రస్తుతం బ్యాటింగ్ చేస్తున్న భారత్ జట్టు.. కడపటి వార్తలు అందేటప్పటికి 29.4 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి 220 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =